సాక్షి
పల్నాడు

ఆదివారం । 8 । అక్టోబర్ । 2023




ఉర్దూ పాఠశాల తనిఖీ

తాడేపల్లిరూరల్ : వడ్డేశ్వరం ప్రభుత్వ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను ఉర్దూ పాఠశాలల తనిఖీ అధికారి ఎం.డి.ఖాసిం శనివారం తనిఖీ చేశారు.



క్యాన్సర్‌పై అవగాహన

పెదకూరపాడు: 75 త్యాళ్లూరు, పెదకూరపాడు జెడ్పీ పాఠశాల విద్యార్థినులకు క్యాన్సర్, కౌమర దశలో వచ్చే వ్యాధులపై విజ్ఞాన్ యూనివర్సిటీ కో-ఆర్డినేటర్లు అవగాహన కల్పించారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 2,720 క్యూసెక్కులు విడుదల చేశారు.

కళ్లెదుటే కలల గృహం

త్వరలో ముహూర్తం

- రాష్ట్ర వ్యాప్తంగా ఐదు లక్షల గృహాలు సిద్ధం
- సామర్లకోటలో ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్
- జిల్లా వ్యాప్తంగా 13 వేల ఇళ్లలో అడుగుపెట్టనున్న లబ్ధిదారులు
- చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్న అధికారులు


నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): రాష్ట్రంలో ఇల్లు లేకుండా ఏ ఒక్కరూ ఉండకూడదనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు–పేదలందరికీ ఇల్లు కార్యక్రమంలో భాగంగా పేదల సొంతింటి కల సాకారం దిశగా మరో కీలక ఘట్టం ఆవిష్కృతం కానుంది. రాష్ట్ర వ్యాపితంగా త్వరలో ఐదు లక్షల గృహ ప్రవేశాలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కాకినాడ జిల్లా సామర్లకోటలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమాన్ని పేరేచర్ల లే అవుట్‌లో లాంఛనంగా ప్రారంభించేందుకు అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. గుంటూరు జిల్లాలో పేరేచర్ల జగనన్న కాలనీ లబ్ధిదారులను త్వరలో శాశ్వత గృహ యజమానులుగా మార్చేందుకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేస్తోంది. సొంతిల్లు అందించడంతోపాటు గృహ ప్రవేశాలు చేపట్టి వారి కుటుంబాల్లో పండగ సంతోషాన్ని సంపూర్ణంగా నింపనుంది. ఇప్పటికే ప్రభుత్వం నిర్దేశించిన వంద శాతం లక్ష్యాన్ని అధిగమించిన అధికారులు గృహ ప్రవేశానికి అవసరమైన ఏర్పాట్లలో తలమునకలవుతున్నారు.

209 లేఅవుట్లలో ఇంటి నిర్మాణాలు

గుంటూరు జిల్లాలో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 209 లే అవుట్‌లలో ఇంటి నిర్మాణాలు చేపట్టేందుకు అర్బన్ పరిధిలో 67,258 మంది, రూరల్ పరిధిలో 3,186 మొత్తం జిల్లాలో 70,444 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. వీరంతా ఇంటి నిర్మాణాలను వేగంగా జరుపుకుంటున్నారు. 66,345 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. అధికారులు కూడా దగ్గరుండి పర్యవేక్షణ చేస్తూ లబ్ధిదారులకు మరింత అవగాహన కల్పిస్తూ నిర్మాణాలు వేగంగా జరిగేలా తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటి వరకు 13 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తవ్వగా వాటిని సోమవారం ప్రారంభించనున్నారు.

అధికారుల పర్యవేక్షణలో ఇంటి నిర్మాణాలు

జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాలరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. జిల్లాలో 209 లే అవుట్‌లు ఉండగా ప్రతి లే అవుట్‌కి ఒక ఇన్‌చార్జి అధికారి(తహసీల్దార్/ఎంపీడీఓ/హౌసింగ్ ఏఈ), మండలానికొక స్పెషల్ ఆఫీసర్, నియోజకవర్గానికొక స్పెషల్ ఆఫీసర్లను నియమించారు. వీరు ఇంటి నిర్మాణాలను పర్యవేక్షణ చేస్తున్నారు. వీరితోపాటుగా ఇంజినీరింగ్ అసిస్టెంట్/వార్డు ఎమినిటీ సెక్రటరీలు ఎప్పటికప్పుడు లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తూ నిర్మాణాలను వేగవంతం చేస్తున్నారు.



పేరేచర్ల లే అవుట్‌లో నిర్మించిన గృహాలు

అర్బన్ పరిధిలో లబ్ధిదారుల సంఖ్య	67258
రూరల్ పరిధిలో	3186
బిలో బేస్‌మెంట్ లెవల్ స్టేజ్‌లో	22488
బేస్‌మెంట్ లెవల్ స్టేజ్‌లో	26928
రూఫ్ లెవల్ స్టేజ్‌లో	2810
నిర్మాణం పూర్తయినవి(ఇప్పటి వరకు)	13 వేలు



అందంగా తీర్చిదిద్దిన ఓ గృహం

ఇళ్ల నిర్మాణం కోసం రూ.1446.05 కోట్లు మంజూరు

గుంటూరు జిల్లా పరిధిలో 209 లే అవుట్లలో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాల కోసం ప్రభుత్వం రూ.1446.05 కోట్లు మంజూరు చేసింది. ఇందులో ఒక్కొక్క లబ్ధిదారునికి రూ.1.80లక్షలతోపాటు అదనంగా స్వయం సహాయక గ్రూపుల(ఎస్‌హెచ్‌జీ)ద్వారా రూ.35వేలు అదనంగా రుణం మంజూరు చేశారు.

మౌలిక వసతుల కల్పన

జగనన్న కాలనీల్లో తాగునీరు, విద్యుత్, రోడ్లు, ఇతర మౌలిక వసతులు కల్పిస్తున్నారు. ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన సామగ్రి ప్రభుత్వం రాయితీపై లబ్ధిదారులకు అందజేసింది. నాణ్యతలో రాజీపడకుండా ఐఎస్ఐ మార్కు కలిగిన వస్తువులను అందిస్తోంది. త్వరలో గృహ ప్రవేశాలు జరగనున్న పేరేచర్ల లే అవుట్‌లో అన్ని వసతులు కల్పించారు. లబ్ధిదారులు కూడా ఉత్సాహంగా పనుల్లో పాలు పంచుకుంటున్నారు.

అద్దె భారం తగ్గింది



ప్రస్తుతం ఇంటి అద్దెలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఇంత కాలం అద్దెలకు ఉంటూ జీవనం సాగిస్తూ వచ్చాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ద్వారా సొంతింటి కల నెరవేరింది. దీంతో అద్దె భారం తగ్గింది.

– షేక్ ఆషా, గృహ లబ్ధిదారు, పేరేచర్ల

సుందరంగా ఇంటిని నిర్మించుకున్నాం



మా లాంటి పేద ప్రజల సొంతంటి కల నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం. ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో సుందరంగా ఇంటిని నిర్మించుకున్నాం. జగనన్న కాలనీల్లో రోడ్లు, ఇతర మౌలిక వసతులను అధికారులు ఏర్పాటు చేశారు. ఇక నిశ్చింతగా జగనన్న కాలనీల్లో ఏ ధోకా లేకుండా నివాసం ఉంటాం.

– ఏ సుకన్య, గృహ లబ్ధిదారు, పేరేచర్ల

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం



జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జగనన్న కాలనీల్లో లబ్ధిదారుల గృహ ప్రవేశాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇందుకోసం జిల్లాలోని పేరేచర్ల లే అవుట్‌లో సర్వం సిద్ధం చేశాం. రాష్ట్రస్థాయి కార్యక్రమం సీఎం వైఎస్ జగన్ చేపట్టనుండగా...జిల్లా స్థాయి కార్యక్రమానికి జిల్లా ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు.

– టి వేణుగోపాల్, హౌసింగ్ పీడీ

పలు రైళ్లు రద్దు

సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ వెల్లడి

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేసినట్లు డివిజన్ సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ శనివారం వెల్లడించారు. రైలు నెంబర్ 17228 గుంటూరు ద్రోణాచలం, కాచిగూడ-నడికుడి(07791), నడికుడి-కాచిగూడ (07792), విజయవాడ-గుంటూరు(07464), గుంటూరు-విజయవాడ(07465), గుంటూరు - కాచిగూడ (17251), మెదక్ - కాచిగూడ(07578), కాచిగూడ-మెదక్ (07577) రైళ్లను ఈనెల 9వ తేదీ నుంచి 15 వరకు తాత్కాలికంగా రద్దు చేయడం జరిగిందని తెలిపారు.

ద్రోణాచలం-గుంటూరు (17227), కాచిగూడ-గుంటూరు(17252) రైలు ఈనెల 10వ తేదీ నుంచి 16వ తేదీ వరకు రద్దు చేయడం జరిగిందని తెలిపారు. విశాఖపట్నం-లింగంపల్లి(12805), విజయవాడ-గుంటూరు(07783), గుంటూరు - మాచర్ల (07779), మాచర్ల - నడికుడి(07580), నడికుడి-మాచర్ల(07579), మాచర్ల - గుంటూరు(07780), గుంటూరు-విజయవాడ(07788) రైళ్లు ఈనెల 12వ తేదీ నుంచి 15 వరకు రద్దు చేయడం జరిగిందని తెలిపారు.

పలు రైళ్ల రాకపోకలు పునరుద్ధరణ..

గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో ఇటీవల కాలంలో రద్దు చేయబడిన రైళ్లు తిరిగి పునరుద్ధరణ చేస్తూ రాకపోకల కొనసాగింపు జరుగుతుందని డివిజన్ సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ శనివారం తెలిపారు.

హుబ్లీ-విజయవాడ(17329) రైలు ఈనెల 11వ తేదీ నుంచి, విజయవాడ - హుబ్లీ(17330)రైలు ఈనెల 12వ తేదీ నుంచి, గుంటూరు-సికింద్రాబాద్(17253)రైలు సికింద్రాబాద్-గుంటూరు(17254) రైళ్లు ఈనెల 9వ తేదీ నుంచి ప్రయాణికుల సౌకర్యార్థం పునరుద్ధరించామని తెలిపారు.

- అదేవిధంగా రేపల్లె-మార్కాపురం(07889) మీదుగా ప్రయాణించాల్సిన రైలు ఈనెల 9వ తేదీ నుంచి 15 వరకు తాత్కాలికంగా రద్దు చేస్తూ ఈ రైలు గుంటూరు-మార్కాపురం మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు. మార్కాపురం-తెనాలి(07890) రైలు ఈనెల 9వ తేదీ నుంచి 15 వరకు తాత్కాలికంగా రద్దు చేస్తూ మార్కాపురం-గుంటూరు మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు.

న్యూస్‌రీల్

మహాత్ముడి విగ్రహ ఏర్పాటుకు రూ.14 లక్షల విరాళం



గుంటూరువెస్ట్: కలెక్టరేట్‌లోని లుంబిని వనంలో జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహ ఏర్పాటుకు బొమ్మిడాల భానుమూర్తి ట్రస్ట్ నిర్వాహకులు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డికి రూ.14 లక్షల చెక్కును అందజేశారు. స్థానిక కలెక్టరేట్‌లో శనివారం ఈ చెక్కు అందజేశారు. బొమ్మిడాల శ్రీమన్నారాయణ, బీవీఎస్‌కె రత్నం, డీఆర్వో చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

బండారు వ్యాఖ్యలు క్షమించరానివి

రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ డైరెక్టర్ గాదె సుజాత




నాదెండ్ల: సభ్య సమాజం తలదించుకునేలా మహిళలపై టీడీపీ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయటం సిగ్గుచేటని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ డైరెక్టర్ గాదె సుజాత చెప్పారు. పల్నాడు జిల్లా చిరుమామిళ్ల గ్రామంలో జరుగుతున్న జగనన్న సురక్ష వైద్య క్యాంపును శనివారం ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి రోజాపై టీడీపీ మాజీ మంత్రి బండారు సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుపట్టారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో మహిళలపై లెక్కలేనని నేరాలు జరిగాయన్నారు. సాక్షాత్తూ మహిళా తహసీల్దార్‌నే వేధించి హింసించిన ఉదంతాన్ని ప్రజలు మరువలేదన్నారు. స్త్రీలను ఉద్దేశించి బండారు మాట్లాడిన పదజాలం మహిళాలోకం అసహ్యించుకునేలా ఉన్నాయన్నారు. బండారు వ్యాఖ్యలు క్షమించరానివని, అతన్ని కఠినంగా శిక్షించాలన్నారు.

పెదకాకాని దర్గా ఆదాయం రూ.22.54 లక్షలు



పెదకాకాని: బాజీబాబా దర్గాలో హుండీ ద్వారా ఆదాయం గణనీయంగా పెరిగిందని వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్, దర్గా ఈఓ షేక్ ముక్తార్‌బాషా చెప్పారు. పెదకాకాని హజరత్ సయ్యద్ బాజీ షహీద్ అవులియా దర్గాలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు అధికారుల ఆదేశాల మేరకు శనివారం హుండీ తెరిచి కానుకలు లెక్కించారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డిప్యూటీ సెక్రటరీ, టీం ఇన్‌చార్జి షేక్ నూర్‌సాహెబ్ పర్యవేక్షణలో ఎటువంటి అవకతవకలు జరగకుండా వీడియో నిఘా, పోలీసు బందోబస్తుతో ప్రత్యేక చర్యలు చేపట్టారు. దర్గాలోని మొత్తం ఆరు హుండీల ద్వారా బాజీబాబా వారికి రూ.22,54,600 ఆదాయం లభించింది. ఉదయం 11 గంటల నుండి రాత్రి 9 గంటల వరకూ లెక్కింపు కొనసాగింది. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు సూపరింటెండెంట్ సయ్యద్ రాఫ్, రెవెన్యూ, పోలీసు, దర్గా సిబ్బంది, కెనరా బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 525.40 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 4,459, ఎడమ కాలువకు 2,021 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 855.20 అడుగుల వద్ద ఉంది.

బైక్‌ల దొంగ అరెస్ట్

- 4 నెలల కిందట చోరీలకు శ్రీకారం
- అరిగిన, మారు తాళాలతో దొంగతనాలు
- సుమారు రూ.20 లక్షల విలువ చేసే 24 మోటారు సైకిళ్లు స్వాధీనం

నగరంపాలెం: అరిగిన/మారు తాళాలతో మోటారుసైకిళ్లను దొంగలించే అంతర్ జిల్లా దొంగను గుంటూరు సీసీఎస్, కొత్తపేట పోలీసులు అరెస్ట్ చేశారు. అతని నుంచి సుమారు రూ.20 లక్షలు విలువ చేసే 24 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు సీసీఎస్ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను జిల్లా ఏఎస్పీ (క్రైం) ఎ.శ్రీనివాసరావు వెల్లడించారు. ఇటీవల గుంటూరులో వరుసగా జరుగుతున్న మోటారు సైకిళ్ల చోరీలపై బాధితుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ ఆదేశాల మేరకు తూర్పు ఏఎస్పీ నాచికేత్ షెల్కే నేతృత్వంలో సీసీఎస్, కొత్తపేట పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి, చోరుల ఆచూకీ కోసం గాలింపు ముమ్మరం చేశారు. ముందస్తు సమాచారంతో శనివారం కొత్తపేట మాయాబజార్‌లో మకాం వేశారు. ఈ క్రమంలో గౌరీశంకర్ థియేటర్ సమీపాన మోటారు సైకిల్‌పై ఉన్న ఓ యువకుడు పోలీసులను చూసి పరారయ్యేందుకు ప్రయత్నించాడు. కొత్తపేట పీఎస్ ఎస్ఐ లక్ష్మీనారాయణరెడ్డి, సిబ్బంది కలిసికట్టుగా అతని పట్టుకున్నారు. పోలీసులకు చిక్కిన వ్యక్తి పాత గుంటూరు బాలాజీనగర్ ఐదో వీధికి చెందిన ఆవుల రాఘవయ్యగా గుర్తించారు. పోలీసుల విచారణలో నేరం రుజువుకావడంతో అతన్ని అరెస్ట్ చేసి, సుమారు రూ.20 లక్షలు విలువ చేసే 24 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.



మాట్లాడుతున్న ఏఎస్పీ (క్రైం)శ్రీనివాసరావు, పక్కన సీఐలు శ్రీనివాసరావు, అన్వర్‌బాషా

తాపీ పని వదిలి...చోరీల వైపు..

రాఘవయ్య బీకాం ఉత్తీర్ణత కాలేదు. దీంతో అతను తాపీ పనులకు వెళ్లేవాడు. చెడు వ్యసనాలకు బానిసై, సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆశ ఉండేది. చోరీలకు పాల్పడితే, త్వరగా డబ్బులు సంపాదించవచ్చనే దురుద్దేశంతో మోటారుసైకిళ్లపై కన్నేశాడు. సరిగ్గా నాలుగు నెలల కిందట మొదటిసారి పాతగుంటూరులో ఒక మోటారుసైకిల్‌ను దొంగలించాడు. ఇక అప్పటి నుంచి గుంటూరు ఆర్టీసీ బస్టాండ్, జీజీహెచ్, నగరంపాలెం, తదితర ప్రాంతాల్లో ఇళ్ల ముందు నిలుపుదల చేసిన ద్విచక్ర వాహనాలను అరిగిన/మారు తాళాలతో అపహరించి ఉడాయించేవాడు. అలా తెనాలిలో ఒకటి, గుంటూరు నగర పరిసరాల్లో 23 మోటారు సైకిళ్లను దొంగిలించాడు. ద్విచక్రవాహనాలను పాతగుంటూరు బాలాజీనగర్ చివర్లోని పొలాల్లో చెట్ల వద్ద భద్రపరిచేవాడు. ఈ క్రమంలోనే శనివారం ఒక మోటారు సైకిల్‌ను విక్రయించేందుకు మాయాబజార్‌కు వచ్చి పోలీసులకు చిక్కాడు. వరుస చోరీలను త్వరితగతిన చేధించిన తూర్పు ఏఎస్పీ నాచికేత్ షెల్కే, ఏఎస్పీ (క్రైం) ఎ.శ్రీనివాసరావు, డీఎస్పీ (క్రైం) కె.ప్రకాష్‌బాబు, సీఐలు డి.వెంకన్నచౌదరి, బెల్లం శ్రీనివాసరావు (సీసీఎస్) షేక్.అన్వర్‌బాషా (కొత్తపేట పీఎస్), ఎస్ఐ ఎం.లక్ష్మీనారాయణరెడ్డి (కొత్తపేట పీఎస్), ఏఎస్ఐలు ఎం.ఆంటోని, వి.ప్రసాద్, హెడ్‌కానిస్టేబుళ్లు ఎండీ.జానీ, షేక్.ఖాసీం, ఎన్.రమేష్, కానిస్టేబుళ్లు బి.ఉమామహేశ్వరరావు, ఎన్.రవి, కోటేశ్వరరావు, హోంగార్డు వై.విజయ్‌లను జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ అభినందించారు. అనంతరం పలువురికి నగదు రివార్డులను ఏఎస్పీ అందించారు.



స్వాధీనం చేసుకున్న మోటారు సైకిళ్లు

టీడీపీ కండువా రాజకీయం

- వ్యక్తిగత ప్రాభవం కోసం పార్టీలోకి బలవంతపు చేరికలు
- వైఎస్సార్ సీపీలోనే ఉంటామంటున్న నాయకులు

సత్తెనపల్లి: సత్తెనపల్లి నియోజకవర్గంలో టీడీపీ నాయకులు కండువా రాజకీయాలు చేస్తున్నారు. తమ బలం పెరిగినట్లు చూపించుకునేందుకు వైఎస్సార్ సీపీ నాయకులకు బలవంతంగా కండువాలు కప్పి పార్టీలో చేరినట్లు ప్రచారం చేసుకుంటున్నారు. ఎన్ని జిమ్మిక్కులు చేసినా పార్టీకి మైలేజీ పెరిగే పరిస్థితి కనపడటం లేదు. చివరికి చంద్రబాబు నాయుడు అరెస్టయినా పార్టీ శ్రేణులనుంచి స్పందన కొరవడింది. ఒకటి, రెండు సామాజిక వర్గాలే భుజాన వేసుకొని తమకు తప్పదన్నట్లు కార్యక్రమం ముందుకు నడిపిస్తున్న తరుణంలో కనీసం వ్యక్తిగత ప్రభావమైనా పెంచుకుందామని బలవంతపు చేరికలు చేర్పిస్తున్నారు. వైఎస్సార్ సీపీకి చెందిన వారిని టీడీపీలో చేర్చుకుంటూ కండువాలు కప్పుతున్నాడు. గతంలో సత్తెనపల్లి పట్టణంలో టీపాయింట్ వద్ద ఉన్నవారిని మర్యాదగా పిలిచి మెడలో కండవాలు వేసి పత్రికలకు ప్రచారం చేయించుకున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొంటున్నారు ఇది మంచి పద్ధతి కాదని వారు హితవు పలికారు. బలవంతపు చేరికలను తిప్పికొట్టినప్పటికీ మార్పు రాలేదు. తాజాగా రాజుపాలెం మండలం బలిజేపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తనయుడు జొన్నలగడ్డ సురేష్‌ను స్థానిక నాయకుడు ఒకరు బలవంతంగా తీసుకెళ్లి కన్నా లక్ష్మీనారాయణ దగ్గర కండువా కప్పించారని ఆవేదన వ్యక్తం చేశారు. తిరిగి సురేష్ వైఎస్సార్ సీపీ మండల నాయకులు మర్రి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో కొనసాగుతానన్నారు. పార్టీ బలోపేతం కోసం స్థానిక నాయకులతో కలిసి పనిచేస్తానని స్పష్టం చేశారు.



జొన్నలగడ్డకు బలవంతంగా టీడీపీ కండువా కప్పుతున్న కన్నా



మంత్రి అంబటితో కండువా వేయించుకుంటున్న జొన్నలగడ్డ

వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి కృషి

- ప్రభుత్వ చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు
- ఘనంగా వయోవృద్ధుల దినోత్సవం

నెహ్రూనగర్: వయోవృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తగిన కృషి చేస్తానని శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని వయోవృద్ధుల సంక్షేమ శాఖ, ఏపీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, స్వచ్ఛంద సేవా సంస్థల (వృద్ధుల ఆశ్రమం) సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఉమ్మారెడ్డి మాట్లాడుతూ వయోవృద్ధులు ఎదుర్కొనే సమస్యలు, పిల్లలు, తల్లిదండ్రుల సంరక్షణ, పోషణ, ఆప్యాయతానురాగల గురించి వయోవృద్ధుల అసోసియేషన్స్ విన్నవించిన కోరికలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారిస్తామన్నారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రత్యేక సేవలందించిన వయోవృద్ధులను ఘనంగా సత్కరించడంతోపాటు అవసరమైన వారికి చేతి కర్రలు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ సువార్త, స్త్రీ శిశు సంక్షేమ శాఖ నోడల్ ఆఫీసర్ శ్రీవాణి, డాక్టర్ అనిత, సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ మెంబర్ సీహెచ్ పరమేశ్వరరెడ్డి, ఉమామహేశ్వరరావు, రత్నసాగర్, కైలాష్‌నాథ్, చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ఠ ధర రూ.2400, గరిష్ఠ ధర రూ.3700, మోడల్ ధర రూ.3200 వరకు పలికింది.

క్లుప్తంగా

హెడ్‌కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం

రూ.3.27లక్షల చెక్కు అందజేసిన ఎస్పీ



నరసరావుపేట: సహోద్యోగి కుటుంబానికి చేయూత అందించిన తోటి బ్యాచ్ హెడ్‌కానిస్టేబుళ్ల ఐక్యత ప్రశంసనీయమని జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. ముప్పాళ్ల పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఎ.అనీల్‌కుమార్ గత నెల 21వ తేదీన వేములూరిపాడు గ్రామపరిధిలో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. దీనిపై ఆ కుటుంబానికి తమ వంతుగా ఆర్థిక సహాయంగా తోటి బ్యాచ్ హెడ్ కానిస్టేబుళ్లు ఇచ్చిన రూ.2,27,500 చెక్కును శనివారం జిల్లా ఎస్పీ చేతుల మీదుగా అనిల్ సతీమణి ఎ.మేరీసుజాతకు అందించారు. అదే విధంగా పోలీస్ అసోసియేషన్ తరఫున మరో రూ.లక్ష అసోసియేషన్ ఫండ్ చెక్కును కూడా అందించారు. వారిని ఎస్పీ అభినందిస్తూ అనిల్ కుటుంబానికి పోలీస్ విభాగం తరఫున రావాల్సిన అన్ని బెనిఫిట్స్‌ను సకాలంలో అందిస్తామని హామీ ఇచ్చారు. పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాణిక్యాలరావు, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు, వేణు పాల్గొన్నారు.

అర్చకుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి

గుంటూరు ఈస్ట్: రాష్ట్రంలో అర్చకుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్యలు చేపడుతోందని దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ ఎస్.సత్యనారాయణ చెప్పారు. కొత్తపేట దేవదాయ శాఖ కార్యాలయంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల అర్చకుల సమస్యలపై అధికారులతో కలసి కమిషనర్ సత్యనారాయణ శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అనువంశిక అర్చకుల పరిరక్షణే ధ్యేయంగా వారి పేర్లు నమోదు చేసుకోవడం జరుగుతోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,539 మంది అర్చకులను గుర్తించామన్నారు. రూ. 5 లక్షల్లోపు ఆదాయం ఉన్న దేవలయాల్లో ఫౌండర్ ట్రస్టీ లేక అనువంశిక అర్చకులకు ఆలయ నిర్వహణ అప్పజెప్పడం జరుగుతోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 250 మంది అర్చకులు దరఖాస్తు చేసుకున్నారన్నారు.

ఉద్యాన పంటల పరిశీలన



డ్రాగన్‌ఫ్రూట్ మొక్కను పరిశీలిస్తున్న కల్పశ్రీ

నరసరావుపేట రూరల్: మండలంలోని ఉప్పలపాడు, పెట్లూరివారిపాలెం గ్రామాల్లో సాగవుతున్న ఉద్యాన పంటలను జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ కల్పశ్రీ శనివారం పరిశీలించారు. ఉప్పలపాడులోని డ్రాగన్ ఫ్రూట్ తోటను పరిశీలించి, సాగు వివరాలను రైతు షేక్ సాంబశివరావును అడిగి తెలుసుకున్నారు. డ్రాగన్ ఫ్రూట్ లాభదాయకంగా ఉందని రైతు వివరించారు. ఉద్యాన శాఖ ద్వారా డ్రిప్, ప్యాక్‌హౌస్ రాయితీలు పొందినట్లు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. కూరగాయలు, పసుపు పంటలను పరిశీలించి సాగులో ఇబ్బందులపై రైతులతో మాట్లాడారు. పెట్లూరివారిపాలెంలో రాళ్ల పందిరిపై దొండసాగు చేస్తున్న రైతు తమ్మిశెట్టి ఏడుకొండలు సాగు వ్యయం, ప్రభుత్వం చేయూతపై ఆమె ఆరా తీశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ ఉద్యాన శాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఉపయోగించుకుని రైతులు లాభాలు పొందడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి జాన్ బెన్ని, ఉద్యాన శాఖ అధికారి నవీన్‌కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీహర్ష, మల్లికార్జున, ఆంజనేయులు పాల్గొన్నారు.

రేపటి లోగా ఈ-పంట నమోదు చేసుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి మురళి

నరసరావుపేట రూరల్: ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పంటలకు సోమవారం లోగా ఈ-పంట నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి కోరారు. మండలంలోని పెదరెడ్డిపాలెంలోని రైతు భరోసా కేంద్రాన్ని శనివారం సందర్శించారు. కేంద్రంలోని ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులు ఆర్‌బీకేల్లో సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. అనంతరం రైతులతో మాట్లాడారు. ఇప్పటికే ఈ-పంట నమోదు గడువు ముగిసిపోగా ఈనెల 9వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం పొడిగించినట్లు చెప్పారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏడీఏ మస్తానమ్మ, మండల వ్యవసాయ అధికారి నరేంద్రబాబు, మండల వ్యవసాయ విస్తరణ అధికారి బ్రహ్మయ్య, గ్రామ వ్యవసాయ సహాయకుడు పవన్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో జెడ్పీ విద్యార్థుల ప్రతిభ



ఆన్‌లైన్‌లో క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పెదకూరపాడు: జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా జి 20 ది ఇండియా నేవి ఆన్‌లైన్‌లో నిర్వహించిన క్విజ్ పోటీల్లో 75 త్యాళ్లూరు జెడ్పీ పాఠశాల విద్యార్థులు శివాంజన్, హేమంత్, మణికంఠ రెండవ రౌండ్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచి క్వార్టర్ ఫైనల్‌కు ప్రవేశించినట్లు ప్రధానోపాధ్యాయులు అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి శనివారం తెలిపారు. పోటీల్లో దేశ వ్యాప్తంగా పన్నెండు వేల పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నట్లు వివరించారు. దేశవ్యాప్తంగా ప్రతిభకనపరిచిన టీంలు అక్టోబర్ 10న నిర్వహించనున్న క్వార్టర్ ఫైనల్స్‌లో పాల్గొంటారన్నారు. శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను శ్రీనివాసరెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ జి.శ్రీనివాస రెడ్డి అభినందించారు.

విద్యార్థులు బాధ్యతలను గుర్తించి స్వీకరించాలి

పెదకాకాని: విద్యార్థులు విద్యార్థి దశలోనే బాధ్యతలను గుర్తించి వాటిని స్వీకరించడం ద్వారా జీవితంలో ఉన్నత స్థానాన్ని అందుకోగలుగుతారని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ డాక్టర్ కె.హేమచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని నంబూరు వీవీఐటీ కళాశాలలో శనివారం 2023-24 సంవత్సరానికి ఎన్నికైన విద్యార్థి విభాగం శాక్ (స్టూడెంట్ యాక్టివిటీ కౌన్సిల్) సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉన్నత విద్యామండలి చైర్మన్ డాక్టర్ హేమచంద్రారెడ్డి హాజరయ్యారు. సవాళ్ళ పరిష్కార మార్గాన్ని తెలిపేందుకు కళాశాలలో 21 విద్యార్థి శాఖలతో 126 మంది విద్యార్థులతో ఏర్పాటు చేసిన విద్యార్థి విభాగం సభ్యులతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు.

తెనాలి డబుల్ హార్స్ ఆధ్వర్యంలో 'ఫిర్ సే ఉడాన్'

ఈనెల 14న ప్రారంభం

తెనాలి: తెనాలి డబుల్‌హార్స్ గ్రూప్, థింక్‌మేట్స్ సంయుక్త ఆధ్వర్యంలో కార్పొరేట్ సామాజిక సేవలో భాగంగా 'ఫిర్ సే ఉడాన్' అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మహిళా సాధికారత కల్పించేందుకు సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ కెరీర్‌ను తిరిగి ప్రారంభించే మహిళల కోసం ఫిర్ సే ఉడాన్‌ను ప్రారంభించారు. ఈ ఈవెంట్‌ను ఈనెల 14వ తేదీ టీ-హబ్ (ఫేజ్-2 రాయదుర్గ్)లో ప్రారంభిస్తున్నట్టు తెనాలి డబుల్‌హార్స్ జనరల్ మేనేజర్ పీఎస్‌వీ కృష్ణప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కెరీర్‌ను పునఃప్రారంభించాలనుకునే మహిళలు, సంబంధిత హెచ్‌ఆర్ మేనేజర్లను నేరుగా కలిసేందుకు, ఇంటర్వ్యూల కోసం ప్లాన్ చేయటానికి లేదా ఐటీ ఉద్యోగానికి దరఖాస్తు చేసేందుకు ఆసక్తి ఉన్నట్లయితే థింక్ మేట్స్ బృందం నుంచి ఉచిత శిక్షణ పొందేందుకు ఇదొక వేదిక అవుతుందని తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రారంభించామని, ఆసక్తిగలవారు ఈవెంట్‌లో పాల్గొనేందుకు పేర్లు నమోదు చేసుకోవచ్చని వివరించారు. మరింత సమాచారం కోసం తెనాలి డబుల్‌హార్స్ వాట్సాప్ 78427 80199 నంబరులో సంప్రదించవచ్చని కృష్ణప్రసాద్ వివరించారు.

ఏసీఏ సెంట్రల్ జోన్ రెండో టెస్ట్ మ్యాచ్ ప్రారంభం

రాణించిన గుంటూరు బౌలర్లు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సెంట్రల్ జోన్ అండర్-23 అంతర్ జిల్లాల మూడురోజుల టెస్ట్ క్రికెట్ పోటీలో భాగంగా శనివారం ప్రకాశం, గుంటూరు జిల్లాల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ప్రకాశంజిల్లా జట్టు తన తొలి ఇన్నింగ్స్‌లో 52 ఓవర్లలో 199 పరుగులు చేసి ఆలౌట్ అయింది. జట్టులోని నిఖిల్ 43, పవన్ కార్తికేయ 42, దుర్గాబాలాజీ 42 పరుగులు సాధించారు. గుంటూరు జిల్లా బౌలర్లు చెన్ను సిద్ధార్థ్ 4, జానీబాషా 5 వికెట్లు సాధించారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన గుంటూరు జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 36 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 127 పరుగులు చేసింది. జట్టులోని సూర్యవంశపు 60 పరుగులు చేసి పెవిలియన్ బాట పట్టగా, మహిమ కుమార్ 38, జానీబాషా 9 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. ఆదివారం రెండో రోజు ఆట కొనసాగనుంది. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.సీ తాపతిరావు పర్యవేక్షించారు.

ప్రజాక్షేమమే ముఖ్యమంత్రి జగనన్న ధ్యేయం

జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



మాట్లాడుతున్న కత్తెర హెనీ క్రిస్టినా

ఫిరంగిపురం: ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. మండల కేంద్రంలోని సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో శనివారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కత్తెర హెనీక్రిస్టినా పాల్గొని మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలోను అమలు కాని సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు పరుస్తున్నారని చెప్పారు. ప్రజలకు ఉపయోగపడేలా అనేక పథకాలు ప్రవేశపెట్టి దళారులతో పనిలేకుండా నేరుగా అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చేస్తున్నట్లు తెలిపారు. చంద్రబాబు పాలనలో ఏ ఒక్క పథకం అమలు చేయలేదని చెప్పారు. అహర్నిశలు ప్రజల కోసం పనిచేసే ముఖ్యమంత్రిని వచ్చే ఎన్నికల్లో ప్రజలు అఖండ మెజార్టీతో గెలుపించుకోవాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, కె.చిన్నప్పరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, జి.చంద్రం, పి.జేమ్స్ ఇన్నయ్య, మేడాబాబు, డి.మెల్కియా, డి.సురేష్, వై.రమాదేవి, జోస్ ఫినా, డేవిడ్, టి.కృష్ణ, పాలపాటి రఘు, బి.శ్రీనివాస రెడ్డి, కమలా రెడ్డి, కె.శ్రీనివాస రెడ్డి, నరేంద్ర కుమార్, పి.చిన్న, ఖాజావలి, సుధా కర రెడ్డి, సీహెచ్ రామమోహన్‌రెడ్డి, టి.కృష్ణ, యల్లారెడ్డి, చిన్నప్ప, బాజీ, వి.రాము, చౌడ య్య, పిచ్చిరెడ్డి, కె.రామారావు, ఈశ్వరరెడ్డి, బ్రహ్మరెడ్డి, గాంధీబుడే, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

గ్రామీణ మహిళలకు దిశానిర్దేశం

ముగిసిన మూడు రోజులు శిక్షణ



విజన్ బిల్డింగ్ శిక్షణ కార్యక్రమంలో ప్రణాళికను వివరిస్తున్న గ్రామ సమాఖ్య ప్రతినిధులు

యడ్లపాడు: మహిళల అభివృద్ధికి వారి అభిరుచులకు అనుగుణంగా జీవనోపాధుల్ని గుర్తించే ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం విజన్ బిల్డింగ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం, జిల్లా రీసోర్సు పర్సన్ ఆరె మండిగ జగ్జీవన్‌రావ్ తెలిపారు. యడ్లపాడు మండల సమాఖ్య ఆధ్వర్యంలో విజన్ బిల్డింగ్ మాడ్యూల్-1పై ఈనెల 4 నుంచి 7వ తేదీ వరకు కొనసాగిన శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. జాతీయ జీవనోపాధుల మిషన్(ఎన్ఆర్ఎల్ఎం) మార్గనిర్దేశంలో విజన్ బిల్డింగ్(లక్ష్యనిర్దేశం) చేసేందుకు గ్రామీణ ప్రాంత మహిళలకు మూడు రోజుల శిక్షణ అందించారు. ఈ శిక్షణకు 39 గ్రామ సమాఖ్య సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఆయా ప్రతినిధులు వ్యక్తిగత, కుటుంబ, గ్రామ లక్ష్యాలను గుర్తించి బృందాలుగా ఏర్పడి చర్చించడం జరిగింది. మొత్తం 48 అంశాలపై లోతైన అధ్యయనం చేస్తూ నవీన మార్పు కలిగే పది అంశాలను ఈ శిక్షణ శిబిరం ద్వారా గుర్తించారు. వచ్చే ఐదేళ్ల కాలంలో ఆయా అంశాలను ప్రాధాన్య క్రమంగా కార్యాచరణ చేయాలని నిర్ణయించారు. మహనీయుడు ఎస్ఆర్ శంకరన్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శంకరన్ జీవిత ఘట్టాలను స్మరించుకున్నారు.

నాణ్యమైన పొగాకు దిగుబడి పెంచాలి



మాట్లాడుతున్న సీనియర్ సైంటిస్ట్ కస్తూరి కృష్ణ

వినుకొండ(నూజెండ్ల): స్థానిక జీపీఐ ఆఫీస్‌లో జీపీఐ ప్రతినిధులు, జీపీఐ ఆగ్రోనమీ టీమ్‌కు శిక్షణ తరగతులు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర పొగాకు పరిశోధన సంస్థకు చెందిన సీనియర్ సైంటిస్ట్, పీఎంఈ సెల్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.కస్తూరి కృష్ణ, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ వెంకటేశ్వర్లు(గుంటూరు) పాల్గొని పొగాకు పంటలో పాటించాల్సిన ఉత్తమ యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణపై శిక్షణ ఇచ్చారు. ఈ పద్ధతులు, మెలకువలు రైతులకు తెలియజేసి అధిక దిగుబడి, నాణ్యమైన పొగాకు పండించేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. జీపీఐ ప్రతినిధులు ఎం. ప్రభాకరరావు, వై.ఎస్.పాటిల్, జీపీఐ ఫీల్డ్‌స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.